సాక్షి నంద్యాల

శనివారం, 9, మార్చి, 2024



దేదీప్యమానం
మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానంది ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎటు చూసినా భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతూ కనిపించాయి.

బిల్వపత్రంపై అర్ధ నారీశ్వరుడు



ఆదోనిరూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బిల్వ పత్రంపై అర్ధనారీశ్వరుని సూక్ష్మ చిత్రాన్ని ఆదోని మండలం నారాయణపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు మల్లికార్జున గీశారు.



నృత్య నీరాజనం
మహానంది: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానందిలో మార్కాపురం పట్టణానికి చెందిన స్నేహ సంగీత నాట్య అకాడమి కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

భక్తులు అటవీ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న నంద్యాల డీఎఫ్‌ఓ అనురాగ్ మీనా

నంద్యాల(సిటీ): శివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలను దర్శించుకునే భక్తులు, ప్రజలు తప్పనిసరిగా అటవీ శాఖ నిబంధనలు పాటించాలని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ అనురాగ్‌మీనా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజన్ పరిధిలో అధికంగా ఆలయాలు ఉన్నాయని వాటిని సందర్శించే సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు, సలహాలు చేశారు. నల్లమల అటవీ ప్రాంతాన్ని పూర్తిగా ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించామన్నారు. భక్తులు ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్లరాదన్నారు. అదేవిధంగా అడవికి నిప్పు పెట్టరాదన్నారు. అడవిలో నివసించే వన్య మృగాలకు ఆహార పదార్థాలను అందించరాదన్నారు. ఆహారం కోసం వచ్చే జంతువులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నాయన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 134 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల ఆవరణంలో జిరాక్స్ సెంటర్లు ఉండరాదన్నారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పకడ్బందీగా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గసమన్వయకర్తగా బీవై రామయ్య

- ప్రకటించిన వైఎస్సార్‌సీపీ అధిష్టానం

కర్నూలు (టౌన్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్తగా బీవై రామయ్య నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రామయ్య పేరును ఖరారు చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. బోయ సామాజిక వర్గానికి చెందిన బీవై రామయ్య మొదటి నుంచి పార్టీకి విధేయుడుగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కర్నూలు నగర మేయర్‌గా పనిచేస్తున్నారు. తాజాగా ఈయనను కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయ కర్తగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

జగనన్నకు రుణపడి ఉంటా

నేను సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తిని. మొదటి నుంచి పార్టీకి విధేయుడిగా ఉన్నా. నాకు ఈ అవకాశం ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటా. మరోసారి 2019 సంవత్సరంలో వచ్చిన ఫలితాలే వస్తాయి. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం.

–బీవై రామయ్య, కర్నూలు నగర మేయర్

బ్రహ్మమురారి సురార్చిత లింగం..
నిర్మలభాసిత శోభిత లింగం..
జన్మజదుఃఖవినాశక లింగం..
తత్ప్రణమామి సదాశివ లింగం..
అంటూ ఆ పరమేశ్వరుడి ఎదుట భక్త జనం ప్రణమిల్లింది. జయ జయ శ్రీశైల లింగ చక్రవర్తి.. నమో నమః అంటూ భక్త కోటి కీర్తిస్తుండగా.. శ్రీగిరి క్షేత్రం పరవశించిపోయింది. పవిత్ర శివరాత్రి వేళ నంది వాహనంపై విహరించిన మల్లన్న ఆతర్వాత పాగా కట్టుకుని పెళ్లి పీటలెక్కి భ్రామరీని వివాహమాడగా అశేష భక్తులు కనులారా వీక్షించి తరించిపోయారు.

– శ్రీశైలంటెంపుల్



శుక్రవారం రాత్రి పాగాలంకరణతో శ్రీశైల ఆలయం



ఉత్సవంలో భక్తుల ఉత్సాహం



భక్తితో ప్రణమిల్లి..

జయ జయ శంకర.. భక్త శుభంకర

- అంబరాన్నంటిన బ్రహ్మోత్సవ శోభ
- పాగాలంకరుడైన శ్రీశైల మల్లికార్జునుడు
- స్వామివారి లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- కనుల పండువగా ప్రభోత్సవం, నందివాహనసేవ
- మల్లన్న చెంత జాగారణ చేసిన భక్తకోటి
- నేడు స్వామిఅమ్మవార్లకు రథోత్సవం, తెప్పోత్సవం

నల్లమల దారుల్లో శంభో శంకర.. హరోం హర.. ఓం.నమఃశివాయ.. నినాదాలు హోరెత్తుతుండగా..ఇల కైలాసమైన శ్రీశైల మహాపుణ్య క్షేత్రంలో దేదీప్యమానంగా ఆధ్యాత్మిక వెలుగులు విరాజిల్లుతుండగా.. మహా శివరాత్రి బ్రహ్మోత్స సంబరాలు అంబరాన్ని తాకాయి. శివరాత్రి పర్వదినం శుక్రవారం శ్రీగిరులు భక్తజన సంద్రం ఉప్పొంగి భక్తి భావం ఎగిసి పడింది. శివరాత్రి జాగారణ చేసి మల్లన్నను దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలిరాగా బ్రహ్మోత్సవ వైభవాన్ని చూసేందుకు రెండు కనులు చాలడం లేదు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ప్రభోత్సవం, నందివాహనసేవ, పాగాలంకరణ, కల్యాణోత్సవం కనుల పండువగా సాగాయి. శివ రాత్రి తర్వాతి రోజు జరిగే రథోత్సవ నిర్వహణకు వీలుగా ముందస్తుగా ప్రభోత్సవం జరుపుతారు. సుగంధ పుష్పాలతో ప్రభను అలంకరించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండిపల్లకీలో ఆలయ ప్రదక్షిణ చేయించి క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తోడ్కొని వచ్చారు. అనంతరం ప్రభపై ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభోత్సవం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు సాగింది. ప్రభోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తరించారు.

నందివాహనంపై ఊరేగిన మల్లన్న

శ్రీభ్రమరాంబా సమేతుడైన మల్లికార్జునుడు నంది వాహనంపై విహరించారు. ఉభయ దేవాలయాల ప్రాంగణంలో అక్కమహాదేవి అలంకార మండపంలో నందివాహనసేవ నిర్వహించారు. నందివాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను తోడ్కొనివచ్చి ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా హారతులను ఇచ్చి పూజలు నిర్వహించారు. నందివాహనంపై కొలువైన ఆది దంపతులను ఆలయ ప్రదక్షిణ ద్వారా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో వివిధ జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



నందివాహనంపై కొలువై స్వామి అమ్మవార్ల ఆలయ ప్రదక్షిణ

లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 10 గంటల నుంచి స్వామివారికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. నిష్ణాతులైన 11 మంది అర్చకస్వాములు, వేద పండితులు మహాన్యాసపూర్వకంగా రుద్ర మంత్రాలను పఠిస్తుండగా జ్యోతిర్లింగ స్వరూపుడైన స్వామివారికి అభిషేకం జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికాగుండంలోని జలాలతో, పంచామృతాలతో, ఫలోదకాలతో అభిషేకం నిర్వహించారు.

అద్భుతం పాగాలంకరణ

లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభమైంది. బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. మన వివాహాల్లో పెండ్లి కుమారునికి తల పాగ చుట్టడం ఒక సంప్రదాయం. ఈ ఆచారమే శ్రీశైల ఆలయంలో పాగాలంకరణ పేరుతో ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈ పాగా గర్భాలయ విమాన శిఖరం నుంచి ముఖమండపంపై ఉండే నవనందులను అనుసంధానం చేస్తూ అలంకరించబడుతుంది. శుక్రవారం రాత్రి 10 గంటలకు ఆలయంలోని విద్యుత్ సరఫరాను నిలిపివేయగా బాపట్ల జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వి వెంకటేశ్వర్లు దిగంబరుడై తాను స్వయంగా నేసి తెచ్చిన పాగాతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సమర్పించిన పాగాను కూడా స్వామివారికి అలంకరించారు. మొత్తం 25 పాగాలు భక్తులు స్వామివారికి సమర్పించారు. పాగాలంకరణ జరుగుతున్నంత సేపు ఆలయంలో ఓంనమఃశివాయ అంటూ శివనామస్మరణ మారుమోగింది.

కమనీయం.. కల్యాణం

రాత్రి 12 గంటల సమయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. ముందుగా కల్యాణానికి కంకణాలను, స్వామిఅమ్మవార్ల ఆభరణాలను, యజ్ఞోపవీతాన్ని, బాషికాలను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కల్యాణోత్సవంలో స్వామివారు పట్టువస్త్రాన్ని ధరించి, తలపై ఒకవైపు గంగమ్మను, మరోవైపు నెలవంకను, మెడలో రుద్రాక్ష మాలను, నుదుట విభూది రేఖలను, పట్టువస్త్రాలను ధరించి పెండ్లికుమారునిగా ముస్తాబు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

చేశారు. అమ్మవారు ముదురు ఎరుపురంగు పట్టు వస్త్రాలను ధరించి, నుదుట కల్యాణ తిలకాన్ని, బుగ్గన చుక్కను, సూర్యాభరణాలను ధరించిన భ్రమరాంబాదేవి పెళ్లి కూతురుగా ముస్తాబై స్వామివారితో కలిసి అర్ధరాత్రి 12 గంటలకు వెండిపల్లకీలో పెండ్లి మండపానికి చేర్చగా కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల వివాహ వేడుకను తిలకించిన భక్తులు పరవశించిపోయారు. స్వామివారి పాగాలంకరణ, కల్యాణోత్సవంలో కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్, ఇతర అధికారులు, లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవ రోజు శనివారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు ఆలయ పుష్కరిణి వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు తెప్పోత్సవం నిర్వహిస్తారు.



మహిళల సాంస్కృతిక ప్రదర్శన



అశేష భక్తజనం మధ్య ప్రభోత్సవం



మహిళల కోలాటం

కలెక్టర్, డీఐజీ, ఎస్పీ పర్యవేక్షణ



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఐజీ విజయరావు



వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా కలెక్టర్ శ్రీనివాసులు, డీఐజీ విజయరావు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుక్రవారం శ్రీశైల క్షేత్రంలోనే ఉండి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలసి సమీక్షించారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సదుపాయం, పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టి ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని డీపీఓను కలెక్టర్ ఆదేశించారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులలో తాగునీటి కొరత లేకుండా పర్యవేక్షిస్తూ నీటిని నింపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవస్థాన ఈఈని ఆదేశించారు. అలాగే పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి పార్కింగ్ ప్రదేశాలలో సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. శుక్రవారం రాత్రి 9గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 5 గంటల వరకు ఏపీ వైపు దోర్నాల నుంచి శ్రీశైలం వైపు వెళ్లే బస్సులు, అలాగే తెలంగాణ వైపు మున్ననూర్ చెక్‌పోస్టు వద్ద శ్రీశైలం వెళ్లే బస్సులు, ఇతర వాహనాలను నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తూ..

శ్రీశైల క్షేత్రంలో భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, ఏఎస్పీలు ప్రవీణ్ కుమార్, చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు నాయుడుతో కలసి బందోబస్తును పర్యవేక్షించారు. అనంతరం దేవస్థానం చుట్టుప్రక్కల, క్యూలైన్లలో ఏర్పాటు చేసిన 568 సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి అక్కడి కమ్యూనికేషన్ సిబ్బందికి, దేవస్థానం సిబ్బందికి సూచనలు చేశారు. క్యూలైన్లు వేగంగా ముందుకు కదిలేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఐపీలు, ప్రజాప్రతినిధులు ఎంతమంది వస్తారని అంచనా వేసి తగిన విధంగా భద్రత ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

నంది వాహనాధీశా నమోస్తుతే!

- మహానందీశ్వరుడికి మహారుద్రాభిషేకం

మహానంది: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామివారు శుక్రవారం రాత్రి నంది వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికుల బృందం ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి,అమ్మవారు శేషవాహనంపై కొలువై ఆలయ ప్రాంగణంలో విహరించారు. రాత్రి మహానందీశ్వరుడి దంపతులు నంది వాహనంపై అశేష భక్తజనం మధ్య విహరిస్తూ భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని కలిగించారు. అర్ధరాత్రి లింగోద్భవం సమయంలో శ్రీ మహానందీశ్వరస్వామికి మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ ఆధ్వర్యంలో పండితులు, రుత్వికులు గంధ, చందన, విశేష ద్రవ్యాలతో అభిషేకించారు. మహా రుద్రాభిషేకం అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో సీఎఫ్ఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



భక్తజన సంద్రంగా మారిన మహానంది

'పాలుట్ల' అభివృద్ధికి కృషి

- అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి)/బేతంచెర్ల: పాలుట్ల రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. బేతంచెర్ల మండలం గూటుపల్లె గ్రామ సమీపాన కొండల్లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగనాథస్వామి ఆలయంలో రూ.1.10 కోట్లతో చేపట్టే ఆలయ అభివృద్ధి పనులకు ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి, ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయంలో చేపట్టే గాలిగోపురం, మెట్లు, ధ్వజస్తంభం, ఆల్వార్లు గుడి నిర్మాణం తదితర పనులపై దేవదాయ శాఖ డీఈ శ్రీనివాస ప్రసాద్, ఏఈ రవి కుమార్ రెడ్డితో మంత్రి బుగ్గన చర్చించారు. ఆలయ నిర్మాణం ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. గూటుపల్లె గ్రామం నుంచి ఆలయానికి రూ. 6.50 కోట్లతో చేపట్టిన రహదారి నిర్మాణ పనుల పురోగతిపై పంచాయతీ రాజ్ ఇంజినీర్ గణేష్‌తో మంత్రి బుగ్గన చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పత్తికొండ నియోజకవర్గ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, రాష్ట్ర ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ డైరక్టర్లు ముర్తుజావలీ, ఖాజా, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి , వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, మాజీ చైర్మన్లు గుండా జగన్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాలుట్ల రంగస్వామి ఆలయ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

'అగ్నివీర్' రిజిస్ట్రేషన్ల ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): భారత సైన్యంలో ప్రవేశం కోసం నిర్వహించే అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడానికి మార్చి 22వ తేదీ వరకు అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు WWW.JOININDIANARMY.NIC.IN వెబ్‌సైట్‌ను సందర్శించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అశ్వత్థాపురంలో అగ్నిప్రమాదం

కర్నూలు: కల్లూరు మండలం పందిపాడు శివారులో ఉన్న అశ్వత్థాపురంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వామిదొడ్డి కళ్లంలో ఉన్న రెండు గుడిసెలు, గడ్డివాములు ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. అలాగే రెండు ఎద్దులు కూడా గాయాలపాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయటం వల్ల ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చునని అగ్నిమాపక సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంలో దాదాపు రూ.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగివుండవచ్చునని అంచనా వేస్తున్నారు.

హోటల్ యజమానిపై దాడి

- ఏడుగురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: పట్టణంలోని అభిరుచి హోటల్ యజమానిపై దాడి చేసిన సంఘటనలో ఏడుగురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. మూడు రోజుల క్రితం దొర్నిపాడు మండలం డబ్ల్యు గోవిందిన్నె గ్రామానికి చెందిన చంద్రుడు, శ్రీకాంత్‌తో పాటు మరో ఐదుగురు భోజనం చేసేందుకు హోటల్‌కు వచ్చారు. హోటల్ క్లోజ్ చేసే సమయం కావడంతో భోజనం లేదని యజమాని మౌలాలి వారికి సర్ది చెప్పాడు. భోజనం పెట్టాల్సిందేనని వాగ్వాదానికి దిగి యజమానిపై దాడి చేశారు. మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గోస్పాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దీబగుంట్ల మెట్ట సమీపంలో గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని, రెండు చొక్కాలు, రెండు పాయింట్లు వేసుకుని ఉన్న ట్లు తెలిపారు. ఎడమ కాలర్ బోన్‌పై నల్లటి పుట్టుమచ్చ ఉందని, ప్యాంటు జేబులో ప్లాస్టిక్, ఇనుప ముక్కలు, అగ్గిపెట్టె వంటివి లభించినట్లు చెప్పారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తు పట్టినట్టు అయితే గోస్పాడు మండల పోలీస్ స్టేషన్ నెంబర్ 9121101172 కు తెలుపవచ్చని ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



నంద్యాల: నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించిన దృశ్యం



కొత్తపల్లి: సంగమేశ్వర ఆలయంలో వేపధారు శివలింగాన్ని పూలతో అలంకరించిన దృశ్యం



ఆదోనిరూరల్: మండిగిరిలోని శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



ఆస్పరి: రామతీర్థంలో పూజలందుకున్న రామలింగేశ్వర స్వామి



గోనెగండ్ల: హెచ్. కైరవాడిలో శివుని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



పాములపాడు: యర్రగూడూరులో చిన్నారుల కోలాటం



శ్రీశైలం: పాతాళగంగ వద్ద పోటెత్తిన భక్తులు

శంభో.. శివ శంభో!

శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, మహానంది, యాగంటి, ఓంకారం, కాల్వబుగ్గ, రుద్రకోడూరు, బ్రహ్మగుండం, సంగమేశ్వరం, కొలనుభారతి సప్త శివాలయాలు, భోగేశ్వరం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వరాలయాలను లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పండుగ సందర్భంగా ఉపవాసం ఉండి జాగారం చేశారు. పరమశివునికి పంచామృతాభిషేకాలు చేశారు. రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. లింగాష్టకాన్ని, శివ పంచాక్షరి మంత్రాన్ని జపించారు. లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవ వేడుకలను వీక్షించారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. –సాక్షినెట్‌వర్క్



కర్నూలు: జగన్నాథగట్టులోని సంగమేశ్వరాలయంలో భక్తుల సందడి



బనగానపల్లె రూరల్: యాగంటిలో పూజలందుకున్న ఉమామహేశ్వరస్వామి



కర్నూలు: సాయీశ్వరాలయంలో శివపార్వతులు



బేతంచెర్ల: శివునికి పూజలు నిర్వహిస్తున్న శివమాలధారులు



ఓర్వకల్లు: బుగ్గరామేశ్వరుని దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



శ్రీశైలం: శివనామస్మరణలో శివస్వాములు

చీటింగ్ కేసులో వ్యాపారి అరెస్ట్



నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

దేవనకొండ: అధిక వడ్డీ ఆశ చూపి మండలంలోని బండగట్టు రైతుల నుంచి రూ.3 కోట్లు దాకా వసూలు చేసుకుని మోసం చేసిన అదే గ్రామానికి చెందిన కురువ చంద్రన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీ నివాసులు తెలిపిన వివరాల మేరకు.. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. దేవనకొండ సమీపంలో కురువ చంద్రన్నను అరెస్టు చేశామని, నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: తుంగభద్ర నది ఒడ్డున తరలించేందుకు సిద్ధంగా ఉన్న కర్ణాటక మద్యం బాటిళ్లను (960 టెట్రా ప్యాకెట్లను) స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. వీటి విలువ రూ.60,480 ఉంటుందని పేర్కొన్నారు. కోసిగి మండలం కందుకూరు గ్రామానికి చెందిన వీరారెడ్డి అనే వ్యక్తికి చెందిన మద్యంగా గుర్తించామన్నారు. ఆ వ్యక్తిపై ఇది వరకే కేసులు ఉన్నాయని, త్వరలోనే వీరారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ సీఐ మహబూబ్ బాషా, కానిస్టేబుల్ నాగరాజు తదితరులు ఉన్నారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లతో సెబ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

ఓంకారంలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ముందుగా శ్రీ గంగ, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఈఓ నాగ ప్రసాద్‌లు స్వాగతం పలికారు. ఏ.కోడూరుకు చెందిన చాగంటి మోహన్‌రెడ్డి వృషభాలు మొదటిస్థానం, వైఎస్సార్ జిల్లాకు చెందిన సుదర్శన్, ఏ కోడూరు షన్విత్‌రెడ్డి, చిన్న కానాల గుండం చెన్నారెడ్డి, పెద్ద కొట్టాలకు చెందిన నారాయణరెడ్డిల వృషభాలు వరుసగా విజయం సాధించాయి.



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

అవ్వకు 'వంద'నం

- వందవ పుట్టిన రోజు జరుపుకున్న ఓబుళమ్మ

దొర్నిపాడు: వృద్ధురాలికి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా వందో పుట్టిన రోజును కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన తిరుపతి ఓబుళమ్మ 1924 మార్చి8న జన్మించింది. ఈమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె కోడళ్లు, అల్లుళ్లు, మనవళ్లు, మునిమవళ్లు కలిసి అంతా 50 మందికి పైగా కుటుంబం ఉంది. ఆర్మీ ఉద్యోగి అయిన మనవడు రామచంద్రుడు.. పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం కుటుంబ సభ్యుల మధ్యం ఘనంగా నిర్వహించారు. అంతేగాక ఈమె పుట్టిన రోజే జాతీయ మహిళా దినోత్సవం కావడంతో మరో విశేషం.



వందేళ్లు పూర్తి చేసుకున్న ఓబుళమ్మతో కుటుంబ సభ్యులు

పెన్సిల్ లిడ్‌తో 208 సూక్ష్మ శివలింగాలు



సూక్ష్మకారుడు వైష్ణవ అశోక్‌శ్రీనాథ్

ఆదోనిటౌన్: పట్టణంలోని నారాయణగుంత వీధిలో నివాసముంటున్న పురోహితుడు పద్మనాభాచారి, లక్ష్మి దంపతుల రెండో కుమారుడు వైష్ణవ అశోక్‌శ్రీనాథ్ పెన్సిల్ లిడ్‌తో 208 శివలింగాలను చెక్కి అందరినీ అబ్బురపరిచాడు. తాను హైదరాబాద్‌లోని లింగంపల్లి ఏరియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు అశోక్‌శ్రీనాథ్ తెలిపారు. 0.6 మి.మీ. సైజులో ఉన్న పెన్సిల్ లిడ్‌తో 5 గంటలు కష్టపడి సూక్ష్మ శివలింగాలను రూపొందించినట్లు చెప్పారు. 2009లో 5.3 మి.మీ. సైజులో పెన్సిల్ ముక్కపై వినాయకుడి రూపాన్ని తయారు చేసి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నానని తెలిపారు. 2020లో ఒక సెం.మీ. సైజులో పెన్సిల్ లిడ్‌పై సైకిల్ బొమ్మను రూపొందించడంతో నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందన్నారు. తన అన్న శ్రీకాంత్ కూడా మంచి కళాకారుడేనని తెలిపారు.



పెన్సిల్ లిడ్‌తో చెక్కిన 208 సూక్ష్మ శివలింగాలు

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



మృతి చెందిన బోయ జగన్

డోన్ రూరల్ : మండల పరిధిలోని సీసంగుంతల గ్రామానికి చెందిన శ్రీను, సుంకులమ్మల దంపతుల చిన్నకుమారుడు బోయ జగన్(15) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. యు.కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోయ జగన్ 10వ తరగతి చదువుతున్నాడు. ఇంటి ముందుర ఉన్నహాల్‌లో దుస్తులు ఆరేసుకోవడానికి ఒక జీవైర్ కట్టారు. అక్కడ పెట్టిన సైకిల్ తీసుకోనేందుకు వెళ్లిన బోయ జగన్.. వైర్‌ను ముట్టుకున్నాడు. కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే కుప్ప కూలి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడి తండ్రి శీను ఫిర్యాదు మేరకు డోన్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ నాయకుల ప్రేలాపనలు

- ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే ప్రయత్నం

వెల్దుర్తి(కృష్ణగిరి): టీడీపీ నాయకులు విచక్షణ మరిచారు. దేవుని సన్నిధిలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. బ్రహ్మగుండం క్షేత్రంలో శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వామి వారికి అభిషేకం చేస్తున్నారు. దర్శనానికి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆలయంలో రాజకీయ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పూజ ముగించుకుని బయటకే వెళ్లె సమయంలోనూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. సీఐ సురేశ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి వారించినా టీడీపీ నాయకులు వినుకోలేదు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు అసభ్య పదజాలం వాడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వైఎస్సార్‌సీపీ నాయకులు సహనం పాటించడంతో ఎలాంటి గొడవ చోటుచేసుకోలేదు.

శ్రీశైలంలో కూలిన అలంకార మండపం

శ్రీశైలం టెంపుల్ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమేశ్వరునికి పాగాలంకరణ కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో ఆలయంలోకి భక్తులు చేరుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు భక్తులు అలంకార మండపం పైకి పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఒక్కసారిగా అది కూలింది. అలంకార మండపం రేకుల షెడ్డు కావడంతో పరిమితికి మించి షెడ్డు పైకి భక్తులు చేరుకోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు భక్తులకు చిన్నపాటి గాయాలైనట్లు సమాచా రం. సంఘటన గురించి తెలుసుకున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని భక్తులను అక్కడినుంచి పంపించివేశారు.

శ్రీగిరిలో కిక్కిరిసిన వాహనాలు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం వేలాది వాహనాలు శ్రీశైలం చేరుకున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు పాగాలంకరణ, శ్రీభ్రమరాంభా మల్లికార్జున స్వామి వార్ల కల్యాణం, జాగరణ ఉన్న కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. దీంతో శుక్రవారం రాత్రి 9 నుంచి శనివారం తెల్లవారుజాము 5 గంటల వరకు శ్రీశైలానికి వాహనాలు రాకుండా ప్రకాశం జిల్లా దోర్నాల చెక్‌పోస్టు వద్ద, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద నిలిపివేయాల్సిందిగా నంద్యాల జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు.



పార్కింగ్‌లో వాహనాలు